ప్రజాశక్తి

గురువారం 27 ఏప్రిల్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

విజయవాడ , మచిలీపట్నంలో ఉపాధ్యాయుల ఆందోళనలు

వేధింపులపై గురువుల నిరసన

ఫ్యాప్టో ఆధ్వర్యాన నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలు

ఉపాధ్యాయులను తనిఖీల పేరుతో వేధిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు వ్యతిరేకంగా బుధవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డల్లో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలు నిర్వహించారు.

- వార్తలు లోపలి పేజీల్లో..

మళ్లీ

మనదే అగ్రస్థానం

ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి కృష్ణా మొదటిస్థానం

గత ఏడాది కన్నా పెరిగిన ఉత్తీర్ణత

బాలికలదే హవా

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, ఎడ్యుకేషన్ (విజయవాడ), కలెక్టరేట్ (కృష్ణా) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉమ్మడి కష్ణాజిల్లా రాష్ట్రంలోనే ప్రధమ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో మొదటి సంవత్సరం ఫలితాల్లో 61 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తే, కష్ణాజిల్లాలో 77 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తే, కష్ణాజిల్లాలో 83 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి 57,321 మంది విద్యార్థులు హాజరుకాగా, 44,413 మంది ఉత్తీర్ణత పొంది 77 శాతం ఫలితాలు సాధించారు. వీరిలో బాలికలు 26,892 మంది పరీక్షలకు హాజరుకాగా, 20,963 మంది ఉత్తీర్ణత పొంది 78 శాతం ఫలితాలు సాధించారు. అలాగే బాలురు 30,429 మంది పరీక్షలకు హాజరు కాగా, 23,450 మంది ఉత్తీర్ణత పొంది 77 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 45,944 మంది విద్యార్థులు హాజరు కాగా, 38,353 మంది ఉత్తీర్ణులై 83 శాతం ఫలితాలు సాధించారు. వీరిలో బాలికలు 23,052 మంది పరీక్షలకు హాజరుకాగా, 19,490 మంది ఉత్తీర్ణత పొంది 85 శాతం ఫలితాలు సాధించారు. బాలురు 22,892 మంది పరీక్షలకు హాజరుకాగా, 18,860 మంది ఉత్తీర్ణత పొంది 82 శాతం ఫలితాలు సాధించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర

(మిగతా 6లో)

ఉత్తీర్ణతా శాతం ఇలా

సంవత్సరం	ప్రథమ సంవత్సరం	ద్వితీయ సంవత్సరం
2015	76	83
2016	81	84
2017	77	86
2018	75	84
2019	72	81
2020	75	75
2021	100	100
2022	69	72
2023	77	83

బాలిక ఆత్మహత్య కేసులో జైన్‌కు జీవిత ఖైదు

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలోని లోటస్ అపార్ట్‌మెంట్లో నివసించే ఓ కుటుంబానికి చెందిన మైనర్ బాలికను అదే అపార్ట్‌మెంట్లో నివసించే వినోద్ కుమార్ జైన్ లైంగికంగా వేధించిన కారణంగా ఆ బాలిక అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నేరం రుజువు కావడంతో నేరస్తుడికి కోర్టు జీవితకాల కారాగార శిక్ష విధించింది. బుధవారం విజయవాడలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.రజని ఈ మేరకు తీర్పు వెలువరించారు. అప్పట్లో భవానీపురం పోలీసులు కేసు నమోదుచేసి ఫోక్సో చట్టం కింద వినోద్ కుమార్ జైన్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాపరు జర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు. వినోద్ కుమార్ వేధింపులు భరించలేక విజయవాడలో అపార్టమెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న బాలిక తాను చనిపోయే ముందు వినోద్ జైన్ తనను ఎలా వేధించేవాడో సూసైడ్ లెటర్ రాసింది. అంతేగాక జైన్‌పై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి రజని అతడికి జీవితకాల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నేడు విఎంసి కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం) ఉదయం 10.30 గంటలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరుగుతుంది. మూడు నెలలకు జరుగుతున్న ఈ సమావేశం అజెండాలోకి 54 అంశాలు ప్రతిపాదనకు రాగా, ప్రధాన అజెండా కేవలం 39 అంశాలకే పరిమితమైంది. కౌన్సిల్ అజెండాపై అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాల గురించి అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి, సిపిఎం వేర్వేరుగా తీవ్ర కసరత్తు చేశాయి.

పేద విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యం

కలెక్టర్లు డిల్లీరావు, రాజాబాబు - జగనన్న వసతి దీవెన నిధులు జమ



మచిలీపట్నంలో..

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : పేదరికం విద్యకు అడ్డు రాకూడదనే సంకల్పంతో ప్రభుత్వం పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించటంతోపాటు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో జగనన్న విద్య దీవెన పథకాన్ని అమలు చేస్తోందని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రాజాబాబు అన్నారు. ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి బుధవారం అనంతపురం జిల్లా నార్పలలో నిర్వహించిన వసతి దీవెన కార్యక్రమాన్ని విజయవాడ, మచిలీపట్నంలలోని కలెక్టరేట్ల నుండి వారు లబ్ధిదారులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం విద్యార్థులకు వసతి దీవెనకు సంబంధించిన చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 37,806 మంది విద్యార్థులకు సంబంధించి రూ.36.18 కోట్ల నిధులను వసతి దీవెన కింద విద్యార్థులకు చెందిన 34,206 మంది తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వసతి దీవెన పథకం ద్వారా ఏడాదికి భోజన వసతి సౌకర్యాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, సెంట్రల్ శాసన సభ్యులు మల్లాది విష్ణు వర్ధన్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీ శైలజ రెడ్డి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి, బట్రాజు కార్పొరేషన్ ఛైర్మన్ కె. గీతాంజలి, విశ్వ బ్రహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, జైన్ సంక్షేమ సంస్థ ఛైర్మన్ మనోజ్ కొఠారి, మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ యస్. విజేత, జిల్లా గంధాలయ సంస్థ ఛైర్మన్ టి.జమల పూర్ణమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి. విజయ భారతి, గిరిజన సంక్షేమ అధికారి రుక్మాంగదయ్యా, వివిధ కళాశాల

(మిగతా 6లో)



విజయవాడలో..

ముడా మాస్టర్‌ప్లాన్‌పై అపోహాలు తగదు

ఎంఎల్‌ఎ పేర్ని నాని

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) విడుదల చేసిన మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్‌పై కొందరు క్రైస్తవ సమాజంలో అపోహాలు సృష్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసం అసత్యాలను వ్యాపింపజేసేందుకు ప్రయత్నించడం తగదని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. ఎవరైనా నేరుగా మచిలీపట్నంలోని ముడా కార్యాలయానికి వచ్చి మాస్టర్‌ప్లాన్ నోటిఫికేషన్‌పై సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. బుధవారం మచిలీపట్నంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ మే 9వ తేదీ వరకు మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం ఉందన్నారు. సహేతుక అభ్యంతరాలను ముడా స్వీకరిసుందన్నారు. అమృత నగరాల రూపకల్పన, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినట్లు చెప్పారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులు, విద్యాసంస్థలు, మెడికల్, హెల్త్, సోషల్ కల్చరల్, ఖననం చేసే స్థలాలు, ప్రభుత్వ సంబంధిత కార్యాలయాలను ఎరుపు రంగు పబ్లిక్ - సెమీ పబ్లిక్ పరిధిలోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈమాత్రం అవగాహన లేని కొందరు కేవలం చర్చలను మాత్రమే ఎరుపు రంగులో చూపుతున్నారని పలు సామాజిక మాధ్యమాల్లో సెంటర్‌లోని వినాయకుని గుడి, రాజుపేటలోని కొత్త మసీదు, జామియా మసీద్ ఖబర్ స్తాన్, కన్యకా పరమేశ్వరి అమ్మవారి

(మిగతా 6లో)

లోపభూయిష్టం : కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కష్ణా) : ముడా మాస్టర్ ప్లాన్లో ఎన్నో తప్పులు దొర్లాయని, మల్టీపర్పస్ జోన్లు లేకుండా 90 శాతం రెసిడెన్షియల్ జోన్‌గా చూపారని, దీని వల్ల భవిష్యత్తు తరాలకు తీరని నష్టం జరుగుతుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర విమర్శించారు. బుధవారం మచిలీపట్నంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆనాడు భవిష్యత్తరాల అవసరాలను దష్టిలో పెట్టుకుని మచిలీపట్నం

(మిగతా 6లో)

అనుమానాలు నివృత్తి చేయాలి : వైఎన్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : మచిలీపట్నం నగరపాలక సంస్థ, రూరల్ ప్రాంతాల అభివృద్ధికి మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) విడుదల చేసిన డ్రాఫ్ట మాస్టర్ ప్లాన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యర్థులను సాధించేలా, అధికార పార్టీ నేతలు, అనుచరులకు లాభం చేకూర్చేవి ధంగా డ్రాఫ్ట మాస్టర్‌ప్లాన్ ఉందనే ఆరోప ణలు వస్తున్నాయన్నారు. మచిలీపట్నంలోని సిపిఎం

(మిగతా 6లో)

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-వీరులపాడు : మండలంలో వీరులపాడు గ్రామంలో ఏప్రిల్ 15న జరిగిన మహిళ హత్య కేసులో ఇదే గ్రామానికి చెందిన ముద్దాయి ఏసోబును పోలీసులు అదుపులో తీసుకొని నందిగామ కోర్టుకు హాజరు పరిచారు. సిఐ నాగేంద్ర కుమార్ తెలిపిన వివరాల ప్రకారం భర్త నుండి విడాకులు పొంది ఒంటరిగా జీవిస్తున్న బూరుగు సోయమ్మ గుర్తుతెలియని వ్యక్తులు బలంగా కొట్టి చంపడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయం నుండి సోయమ్మ ఇంటి నుండి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వెళ్లిచూడగా రక్తం మడుగులో చనిపోయి ఉండడంతో పక్క వీధిలో నివాసం ఉంటున్న అక్క పద్మ వీరులపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేసి ఈనెల 25వ తేదీన ముద్దాయి ఏసోబును అదుపులోకి తీసుకున్నారు. సోయమ్మ ఒంటరిగా ఉండడం గమనించిన ఏసోబు నగదు దొంగిలించడానికి వచ్చి ఆమెను హత్య చేసి నగదు, నగలు తీసుకొని పారిపోయాడు. ఏసోబు గ్రామంలో లేకపోవడంతో అనుమానంతో గాలింపు చేపట్టి అదుపులోకి తీసుకున్నారు. నందిగామ రూలర్ సిఐ నాగేంద్ర కుమార్ ముద్దాయిని నందిగామ కోర్టుకు హాజరు పరిచారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-గంపలగూడెం : మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ను తొలగించాలని ఊటుకూరు గ్రామానికి చెందిన మెరుగు ప్రశాంత్ కుమార్, కొల్లి రమేష్, గద్దల శ్యాంప్రసాద్ ఎక్కిరాల కిషోర్, కొంగల జయ రాజులు బుధవారం స్థానిక శాఖ ఏపీఓ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదును అందజేశారు. ఇప్పటివరకు కొనసాగుతున్న వేల్పుల రాజ శేఖర్ అక్రమా లకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన టింగరికర్ రాము, శ్యామ్, రాజేష్ ల తల్లి, తండ్రి మోహన్ లాల్, విజయలక్ష్మి ల జ్ఞాపకార్థంగా జగ్గయ్యపేట పట్టణంలో డిపో సెంటర్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రమును టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్, యువ నాయకులు శ్రీరాం చిన్నబాబు చేతుల మీదుగా ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణం మురళి, గుడిసె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాదరక్షల తయారీ కేంద్రానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-మైలవరం : జి.కొండూరు మండలంలోని వెల్లటూరు గ్రామంలో షుమారు 6కోట్ల వ్యయంతో పాదరక్షల తయారీ కేంద్రానికి నిధులు మంజూరు చేసినట్లు ఎ.పి చర్మకార సేవాసంఘం వ్యవస్థాపకులు బుల్లా రాజారావు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. వెల్లటూరు గ్రామంలో లిడ్ క్యాప్ సహకారంతో లెదర్ పార్క్ నిర్మాణానికి భూమిని పరిశీలిస్తున్నా మన్నారు. చర్మకారులకు జీవనోపాధిని కల్పించడం కోసం ఎ.పి సి.యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం ఉత్సవ వాల్‌పోస్టర్ ను రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్య పేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ ఉదయభాను

మతసామరస్యానికి ప్రతీక 'ఉరుసు' : ఎంఎల్‌ఎ

ఎడ్ల బండి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

ప్రజాశకి-కంచికచర్ల : మతసామరస్యానికి ప్రతీక ఉరుసు మహోత్సవానికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామం నుండి తుర్లపాడు హాజరత్ బడేమియా బందగీ సయ్యద్ దర్గా ఉరుసు ఉత్సవాలకు బయలుదేరిన ఎడ్లబండ్లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు బుధవారం ప్రారంభించారు. పెండ్యాల గ్రామం నుండి చందర్లపాడు మండలం తుర్లపాడు వరకు మునేటి నుండి కుటుంబ సమేతంగా తరలివెళ్లారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు పెండ్యాల నుండి తుర్లపాడు కు వెళ్ళే ముస్లిం మైనార్టీలకు ఎడ్లబండ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ, ముస్లింలు కలిసి ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఉరుసు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. హిందూ కుటుంబాలకు చెందిన రైతులు అభిమానంతో తమ ఎద్దుల బండ్లపై ముస్లింల కుటుంబ సభ్యులను ఎక్కించుకొని దర్గాల వద్దకు ఊరే గింపుగా తీసుకువెళ్లడం అభినందనీయమని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎంపిపి బషీర్, ఎంపిటిసి బహదూర్, వైసిపి నాయకులు వేల్పుల రమేష్ పాల్గొన్నారు.

6న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మైలవరం : అంగన్వాడీలకు పేస్ రికగ్నైజేషన్ యాప్‌ను రద్దు కోరుతూ ఈ నెల 6వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాని జయప్రదం చేయాలని సి.ఐ.టియు మండల కార్యదర్శి సి.హెచ్ సుదాకర్ పిలుపునిచ్చారు. యాప్‌ను రద్దు కోరుతూ మైలవరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్ వాడీ వర్కర్స్ సి.ఐ.టి.యు బృందం గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీలు, పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలందిస్తు న్నారన్నారు. అలాంటి అంగన్ వాడీలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలేదని, అంగన్ వాడీలు అప్పులు చేసి భోజనం వండిపెడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు కూడా పనిచేయడంలేదని, రకరకాల యాప్‌లను తీసుకు వచ్చి పనిభారం పెంచారన్నారు. ఈ కార్యక్ర మంలో అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మైలవరం ప్రాజెక్టు అధ్యక్షురాలు ఆర్.వి.పుష్పకుమారి, మైలవరం సెక్టార్ నాయకురాలు ఝాన్సీ, లక్ష్మీ, పంచాక్షరి ఈలప్రోలు సెక్టార్ జమలమ్మ, ఇబ్రహీంపట్నం సెక్టార్ భద్రమ్మ, ఇబ్రహీంపట్నం మండల సి.ఐ.టి.యు కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. కంచికచర్ల గ్రామ శివారులో పొలాల నుండి పంట కాలువ ద్వారా నీరు బయటకు రావడానికి పూడిపోవడంతో ఉపాధిహామీ కూలీల ద్వారా పూడికతీత పనులు ప్రారంభించారు. బుధవారం గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత ఉపాధి పనులు పరిశీలించారు. కూలీలకు మెడికల్ కిట్లు, పంపిణీ చేశారు. వేసవిలో ఎండ తీవ్రతకు కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : భగవత్ రామానుజుల తిరు నక్షత్రం సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక నెహ్రూ చౌక్ మున్సిపల్ పార్కులోని రామానుజ సర్కిల్ లోని భగవత్ రామానుజుల వారికి జరిగిన లక్ష మల్లెల అర్చన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను, ఆయన తనయులు వెంకటకష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రభుత్వం దేవాలయాల అభివద్ధికి విశేష కషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ పార్కును ప్రారంభించి పార్కులోని నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ ప్రారంభించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తున్న భగవద్ రామానుజ గోష్ఠి ప్రతినిధులు ఆచార్యులు ఆకుల స్వాతి కుమార్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మెన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, విజయవాడ దుర్గగుడి డైరెక్టర్ నంబూరి రవి, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ పసుపులేటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎల్‌బిఆర్‌సిలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మైలవరం : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రకృతి ఎన్విరాన్‌మెంట్ క్లబ్, ఎ.ఐ.సి.టి.ఇ, స్పైసెస్ ఆధ్వర్యంలో బుధవారం చిత్తడినేల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ అధిక కాలము నీరు నిలిచివుండే లోతు తక్కువగా వుండే ప్రదేశాలను చిత్తడి నేలలుగా పిలుస్తారని, జలవనరులు మానవాళి మనుగడకు ఎంతో కీలకమన్నారు. వాటిని రక్షించు కోవడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్, ఎలక్యూషన్‌పై పోటీలు నిర్వహించి, గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. పకృతి క్లబ్ మెంటార్స్ డాక్టర్ షాహీదా, నీలోఫర్, డాక్టర్ ।వి.బాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న భూహక్కుపై అవగాహన

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ ఆర్‌ఎస్ గార్డెన్ నందు వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం కింద నందిగామ డివిజన్ నందు ఉన్న ఏడు మండలాల సిబ్బందికి అవగాహన సదస్సునకు జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ జిల్లా ఆర్‌ఎస్ గార్డెన్ లో నిర్వహించారు. రెవెన్యూ డివిజినల్ అధికారి ఎ రవీంద్రరావు, మండల తహసీల్దార్లు, విఆర్‌ఓలు, సర్వేయర్ల పాల్గొన్నారు.

మునుకుళ్లలో పొలంబడి క్షేత్ర దినోత్సవం

ప్రజాశక్తి -తిరువూరు

మండలంలోని మునుకుళ్ళ వ్యవసాయ శాఖ అధికారులు వరిలో మేలైన వ్యవసాయ పద్ధతుల పొలంబడి క్షేత్ర దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధి కారి ఎస్.నాగమనెమ్మ పొలంబడి స్టాల్స్ ను పరిశీలించారు. తిరువూరు డివిజన్‌లోని మండల వ్యవసాయ అధికారులతో గ్రామ వ్యవసాయ సహా యకులతో వ్యవసాయ శాఖ రెగ్యులర్ ఆక్టివిటీస్ పై ఆమె రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రతి ఆర్.బికే సిబ్బం ది ఖరీఫ్ కు కావలసిన ఎరువులు ముందుగానే ఇండెంట్ పెట్టి, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశిం చారు. సహాయ వ్యవసాయ సంచాల కులు కెనడి మాట్లాడుతూ పొలంబడి మేలైన వ్యవసాయ పద్ధతులలో పాల్గొని, విజయవంతం చేసిన రైతులకు అభినందించారు. ఎఎంసి చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి మాట్లాడుతూ పొలంబడి పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికర ఆదాయం పొందాలని కోరారు. మొదటిసారిగా జిల్లాలోనే ఈమేలైన వ్యవసాయ పద్ధతులు మునుకుళ్ల గ్రామంలో పాటించి వరి పండించట గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమం లో ఉప సంచాలకులు టి.మాధవిలత, జిల్లా శిక్షణా కేంద్రం, శాస్త్రవేత్త వెంకట రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దామోదరరెడ్డి, ఎడిఎ మోనిష, టెక్నికల్ ఏఓలు డి. శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఎఓ పద్మ, మునుకుళ్ల సొసైటీ అధ్యక్షుడు గోపిరెడ్డి, సిరికొండ కష్ణ, మాస్టర్ ట్రైనర్ లు సురేష్ , టిప్పు సుల్తాన్, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలల ఆధునీకరణ

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని నాడు - నేడు పనుల లో భాగంగా పలు పాఠశాలల్లో లక్షలాది రూపాయల పనులు నిర్వహిస్తున్నట్లు స్థానిక పంచాయతీ రాజ్ శాఖ ఏఈ రేగళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో రేగళ్ల మాట్లాడుతూ పెనుగొలను గ్రామంలో పోస్ట్ ఆఫీస్ వద్దగల పాఠశాలలో 16 లక్షలతో ఒక అదనపు తరగతి గది, పది రకాల విస్తరణ పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు అదనపు తరగతి గదులుగాను 40 లక్షలు, బీసీ స్కూల్ నందు పది రకాల అభివద్ధి పనులకు 12 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. చింతల నరవ గ్రామంలో గల ఎంపీపీ ఎస్ స్కూల్‌లో పది రకాల అభివద్ధి పనులకు గాను 12 లక్షలు, గాదివారిగూడెంలో ఐసిడిఎస్ కేంద్ర నిర్మాణానికి 16 లక్షలు, ఎంపీపీ ఎస్ పాఠశాల లో పది రకాల విస్తరణ పనులకు 16 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

సింగిల్ జాబ్ కార్డుల మంజూరుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని పాతనాగులూరు గ్రామానికి చెందిన కొందరు ఉపాధి హామీ పథకం కూలీలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్ కార్డుల మంజూరుపై ఎంపిడిఓ పి శంకరరావు కు, ఎపిఓ ఆడిమెల్లి భాస్కరరావు కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సింగిల్ జాబ్ కార్డు మంజూరులో కొంత అలసత్వం కారణంగా కొందరు సింగిల్ బ్ధిదారులు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై బుధవారం నాడు ఇన్చార్జి ఎంపిడిఓ పి శంకరరావు, ఎపిఓ భాస్కరరావు లకు లిఖితపూర్వకంగా పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎండిఓ శంకరరావు, ఎపిఓ భాస్కరరావు మాట్లాడుతూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందిన కారణంగా విచారణ జరిపి తగు చర్యలు నిమిత్తం తమ ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తామని వారు తెలిపారు.

మానవత్వం చాటిన శ్రీరాం రాజగోపాల్

ప్రజాశక్తి-వత్సవాయి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కాపాడారు. వివరాల్లోకివెళితే వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన జిడుగు సాంబయ్య కుమార్తె రామలక్ష్మి, కుమారుడు జగదీష్‌లు జి.కొండూరు మండలం, జి. కొండూరు గ్రామం అమ్మమ్మ ఊరి నుండి బైక్‌పై వస్తుంటే మార్గమధ్యం లో నందిగామ హైవే వద్ద వెనుక నుండి మరొక బైక్ వేగంగా వచ్చి వీరి బైక్ ను ఢీకొంది. ఘటనా స్థలంలో గాయాలతో పడిఉండగా అదే సమయంలో విజయవాడ నుండి జగ్గయ్యపేట వస్తున్న శ్రీరాం తాతయ్య వారిని తన కారులో ఎక్కించుకొని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యమందించారు.

పిల్లల్లో అనీమియా నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పిల్లలు, గర్భిణీ స్త్రీలలో అనీమియా నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్లో ఆయన సుస్థిరాభివద్ధి లక్ష్యాల సాధనపై అధికారులతో సమావేశమై చర్చించారు. 10 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల కౌమారదశ బాలికల్లోని రక్తహీనత శాతం, 15 నుంచి 49 సంవత్సరాల వయస్సు గల గర్భిణీ స్త్రీలలో రక్తహీనత శాతం, 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పోషకాహార లోపం గల పిల్లల శాతం, ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, టాయిలెట్లు పనిచేస్తున్న బాలికల పాఠశాలల శాతం, ఆధార్ అప్డేట్ వంటి అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, పిల్లల్లో అనీమియా నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్తూ ఐరన్, పోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు క్షేత్రస్థాయిలో పంపిణీ జరుగుతున్నదీ లేనిదీ హెల్త్, విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ నిత్యం పర్యవేక్షించాలన్నారు. అనీమియా బాధితులకు ట్యాబ్లెట్లు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆన్ లైన్లో నమోదు చేయాలని చెప్పారు. హెల్త్ డిపార్ట్ మెంట్, విద్యాశాఖ వారి అనీమియా బాధితుల ఆన్లై లైన్ డేటాలో వ్యత్యాసాలు ఉన్నాయని, ఏకీకత డేటాను రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆధార్ అప్డేట్ ఇంకా 40 శాతం పూర్తికావలసి ఉందని, అందుకు వాలంటీర్ల సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పించి ఆధార్ అప్డేట్ను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఈఓ తాహేరా సుల్తానా, డిఎంఅండ్ హెచ్ ఓ డా.జి.గీతాబాయి, ఐసిడిఎస్ పీడీ ఎస్. సువర్ణ, సిపీఓ వై. శ్రీలత, డిఎల్డీఓ డి.సుబ్బారావు, సమగ్రశిక్షా ఏపీసీ డా.ఏ. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్‌లో యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో బుధవారం ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. విజయవాడ అయ్యప్ప నగర్ కు చెందిన ఎండి.తహిర్ భాషా అనే వ్యక్తి విజయవాడ ఆటో నగర్ లో డిజిల్ మెకానిక్ గా పని చేస్తు ఆర్థిక సమస్యలు, భార్యతో సమస్యల కారణంగా మంగినపూడి బీచ్ లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోయాడు. దీంతో బీచ్‌లో పెట్రోలింగ్ డ్యూటీ లో నిర్వహిస్తున్న మెరైన్ ఏఎస్ఐ పరింకాయల మురళీకష్ణ, హెూంగార్డు స్వామి, తాలూకా పోలీస్ స్టేషన్ ఓ పి కు చెందిన కానిస్టేబుల్ నాగరాజు లు తహిర్ భాషను గమనించి కాపాడి విజయవాడలో ఉన్న వారి రక్తసంబంధికులకు సమాచారం అందజేసి వారికీ అప్పగించారు. ఒక నిండు ప్రాణాన్ని కాపాడినందుకు హర్షం వ్యక్తం చేశారు, మెరైన్ సీఐ ఎం.శ్యామ్ కుమార్, ఎస్ఐ చంద్రబోస్ సిబ్బందిని అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఎన్. గొల్లపాలెం పశు సంవర్ధక సహాయకులు మోతుకూరి నాగేశ్వరరావు ని గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ (రి. జి నెం 138/2020) నాయకులు బుధవారం పరామర్శించారు. మచిలీపట్నం అర్బన్, మచిలీపట్నం రూరల్ సచివాలయాల్లో పని చేస్తున్న అనేక మంది ఉద్యోగులు సేవ దకృథం, దాతృత్వ భావనతో అందజేసిన రూ.23,116 నాగేశ్వరరావుకి అందజేశారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. రత్నం పుట్టి, జిల్లా అధ్యక్షుడు కోలా నాగబాబు, సహ అధ్యక్షుడు కర్ర అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు కలపాల దినేష్ తేజ, కార్య నిర్వాహక కార్యదర్శి ధరావత్ విజయ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రముఖ నాట్యాచారిణి మంజు భార్గవికి సన్మానం

ప్రజాశక్తి - మొవ్వ : అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి అధ్యక్షురాలు, కూచిపూడి నాట్య కళాకారిణి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ,కళా రత్న ,శంకరాభరణం ఫేం మంజు భార్గవిని ఆ కళామండలి కార్యదర్శి పసుమర్తి మత్యుంజయ శర్మ పర్యవేక్షణలో ఘనంగా సత్కరించారు. గత మూడున్నర దశాబ్దాలకు పైగా అప్పటి కార్యదర్శి దివంగత పసుమర్తి కేశవ్ ప్రసాద్. హయాం నుండి కళామండలి అధ్యక్షురాలుగా కొనసాగుతున్న ఆమె ప్రస్తుతం ఆయన కుమారుడు నాట్యాచార్య, బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత పసుమర్తి మత్యుంజయ శర్మ సారధ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ అఖిలభారత కూచిపూడి నాట్య కళా మండలి"కి కూడా మంజుభార్గవినే అధ్యక్షురాలుగా ఎన్నుకొన్నారు. ఈ నూతన కళా మండలి ఏర్పడిన తర్వాత తొలిసారిగా కూచిపూడి విచ్చేసిన ఆమెను శాలువాతో, సన్మాన పత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం ప్రధాన ఆచార్యులు కేంద్ర సంగీత నాటక అకాడమీ

మంజుభార్గవిని సన్మానిస్తున్న దృశ్యం

సభ్యుడు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళా రత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, విశ్రాంత నాట్య అధ్యాపకులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, నాట్య కళా మండలి సభ్యుడు కావూరి పూర్ణచంద్ర శర్మ, కళా పీఠం ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అతిధులను కళామండలి సత్కరించుకొంది. శ్రీ బాలాత్రిపురసుందరి గ్రంథాలయ పాలకులు వై.వి ఫణికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి-పెదపారుపూడి: మండలంలోని వింజ నంపాడు గ్రామంలో 'మా నమ్మకం నీవే జగన్' కార్యక్రమాన్ని మోపర్రు ఎంపీటీసీ సభ్యురాలు మద్దాలి జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి అందని వారి వివరాలను సేకరిస్తూ ఆ నివేదికను సంబంధిత అధికారులకు అందించి త్వరితగతిన ప్రభుత్వ పథకం అందే విధంగా ఆలోచన చేయనున్నట్లు ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటి యజమాని అనుమతి తీసుకుని మా నమ్మకం నీవే జగనన్న స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ కొమ్మ వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సస్పెన్షన్లు సమస్యలకు పరిష్కారం కాదు

ప్రజాశక్తి -మచిలీపట్నంఅర్బన్ : ఉపాధ్యాయులకు పనిభారం అధికంగా ఉందని, సర్వెన్షన్స్ మాత్రమే సమస్యకు పరిష్కారం కాజాలదని డెమోక్రాటిక్ పిఆర్టియు ఏపి రాష్ట్ర అధ్యక్షులు డా. డి శ్రీను అన్నారు. బుధవారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయములో డెమోక్రాటిక్ పిఆర్టియు, కష్ణాజిల్లా శాఖ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు సకాలంలో పంపిణీ చేయకుండా, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలపై సహేతకంగా పరిశీలన జరపవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం జిల్లాలో డిఈఓ, ఎంఈఓ, పర్యవేక్ష ణాధికారులును సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వి.యస్. పెరుమాళ్ళు, ప్రసన్న రాంబాబు, సంఘ నేతలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అవగాహన సదస్సులు

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల్లో సామర్థ్యం పెంపుదల కోసం అవగాహన సదస్సులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని వారి చాంబర్లో డి ఎల్‌డిఓలతో సమావేశం నిర్వహించి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పనితీరు, పర్యవేక్షణ పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ అభివద్ధి పథకాలు కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. అవన్నీ సజావుగా అమలు అయ్యేందుకు గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థ పటిష్టంగా పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 508 గ్రామ వార్డు సచివాలయాలు ఉన్నాయన్నారు. వాటిల్లో అందిస్తున్న సేవలపై, కార్యకలాపాలపై కార్యదర్శులు అందరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రజల నుండి అందే స్పందన అర్జీల పరిష్కారం పట్ల వారు ప్రత్యేక శ్రద్ధ కనపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో 1048 అసంతప్త స్పందన అర్జీలు ఉన్నట్లు జిల్లా యంత్రాంగం దష్టికి వచ్చిందన్నారు.ప్రజల్లో అసంతప్తి ఎందుకు ఉందో విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో అసంతప్తి తొలగిపోయే విధంగా పరిష్కారం ఉండాలని అందుకోసం జిల్లా వ్యాప్తంగా విస్తతంగా ఉద్యోగుల్లో సామర్థ్యం పెంపుదల కోసం అవగాహన సదస్సులను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. ఇందుకోసం ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. గ్రామ వార్డు

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

సచివాలయాల వ్యవస్థ పనితీరుపై జిల్లాస్థాయిలో కట్టుదిట్టంగా పర్యవేక్షణ ఉండాలన్నారు. అర్జీదారులకు సమాధానం చెప్పేటప్పుడు ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉండరాదని వారి ప్రవర్తన సరళి ఎలా ఉండాలి అనే అంశం పైన వారికి సరైన అవగాహన కలిగించాలన్నారు. స్పందన అర్జీదారులు సంతప్తి చెందే విధంగా పరిష్కారం ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఇన్చార్జి గుడివాడ డిఎల్‌డిఓ సుబ్బారావు, మచిలీపట్నం డి ఎల్ డి వో పద్మ, జిల్లా సమన్వయకర్త రవికాంత్ పాల్గొన్నారు.

ఇంటర్ అర్హతతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : ఉద్యోగంతో పాటు చదువుకునే కార్యక్రమం, ఇంటర్ అర్హతతో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా స్థిరపడి, కెరీర్ పరంగా ఎదగడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో హెచ్ సిఎల్ టెక్ బీ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సారథ్యంలో నైపుణ్యాభివద్ధి సంస్థ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. హెచ్ సిఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్లో ఇంటర్మీడియట్ అర్హతతో హెచ్ సిఎల్ టెక్ బీ ప్రోగ్రాంతో ఉద్యోగాల ఎంపికకు సంబంధించి ఈ నెల 29 వ తేదీ ఉదయం 8:30 గంటలకు గన్నవరంలోని హెచ్ సిఎల్ టెక్నాలజీస్లో నిర్వహించబడే హెచ్ సి ఎల్ టెక్ డ్రైవుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా https:// bit.ly/ HCLTB_AndhraPradeshలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. దీనికి ఇంటర్ ఎంపీసీ, ఎంఈసి గ్రూపులలో 2022, 2023 సంవత్సరంలో 75 శాతం ఉత్తీర్ణతతో, మాథ్స్ సబ్జెక్టు లో 60 శాతంతో పాసైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది, అన్నపూర్ణ, హెచ్ సిఎల్ ప్రతినిధులు, నైపుణ్యాభివద్ధి సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : మానసిక ఉల్లాసం, ఆరోగ్యానికి దోహద పడే క్రీడల పట్ల యువత ఆసక్తి పెం పొందించుకుని పేరు ప్రఖ్యాతులు గడిం చాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆకునూరులో గారపాటి బాబూరావు మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్, టెన్నిస్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాం తాల్లో సాంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్నాయని, వేసవిలో ఇటువంటి పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. క్రికెట్తో పాటు గ్రా మీణ సాంప్రదాయ క్రీడల పోటీలు నిర్వహించాలని సూచించారు. నిర్వాహకులు ఓం కార్, రవి, కార్తీక్, నాని, సాయి, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రజనికి అంతర్జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : మంచి సమారిటన్ థియోలాజికల్ సెమినరీ ఐఎన్‌సి, మనం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మచిలీపట్నంకు చెందిన అమ్మిరెడ్డి రజని సేవలకు ఉమ్మడి డాక్టరేట్, అంతర్జాతీయ గోల్డెన్ హ్యూమానిటీ మహిళా పురస్కారం ప్రధానం చేశారు. గతంలో ఆమెకు నేషనల్ అంబేద్కర్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు, మనం ఫౌండేషన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు ఇచ్చి సత్కరించారు. అమ్మిరెడ్డి రజిని ఆంధ్రప్రదేశ్ కి చెందిన యునైటెడ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ స్టేట్ ఉపాధ్యక్షులు, బీసీ మహిళా అధ్యక్షులు, ఉమ్మడి జిల్లా దివ్యాంగుల అధ్యక్షులుగా అందించిన సేవలను పురస్కరించుకొని అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ టీం మెంబెర్లు, హైకోర్టు లాయర్లు బరిగే అయ్యప్ప, బరిగే చిరంజీవి, మనం ఫౌండేషన్ చైర్మన్ డా. చక్రవర్తి, టీమ్ మెంబర్స్ చండిక పణి, చండిక హరేంద్ర, విన్నీ, గుజ్జు నాని, దివ్య, కావ్యలు పాల్గొన్నారు.

శ్రీనివాస రామనుజన్ వర్ధంతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: డాక్టర్ జాకీర్‌హుస్సేన్ కళాశాల, జెవివి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శ్రీనివాసరామనుజన్ వర్ధంతి సభకు

కళాశాల ప్రిన్సిపాల్ యస్ మహబూషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర అధ్యాపకురాలు మల్కపురపు దుర్గాభవానీ, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు శ్రీనివాసరామనుజన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెవివి కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్‌కె సర్దార్ సాహెబ్, ఉపాధ్యక్షులు ఎస్.మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన భూమితోనే మానవ మనుగడ సాధ్యం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: భూమి ఆరోగ్యంగా ఉంటేనే మానవ మనుగడ ఆహ్లాదంగా సాగుతుందని ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా జిల్లా యువజన సర్వీసుల శాఖతో కలిసి ప్రపంచ ధరిత్రీ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మహబాష మాట్లాడుతూ అభివృద్ధి, నివాస స్థలాల పేరుతో అడవులు నరికి వేయరాదన్నారు. వ్యవసాయ రంగంలో ఎరువులు, క్రిమి సంహారకాల మోతాదు పెరగడంతో భూమి కూడా నిస్సారమవుతుందన్నారు. పరిమితికి మించి జరుగుతున్న మైనింగ్ క్వారీంగులను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నాగుల్‌మీరా, మస్తాన్‌వలీ, జాఫర్ సాదిక్, హైకోర్టు న్యాయవాది బి, సుధీర్‌కుమార్ యువజన సర్వీసుల విభాగ సూపరిండెంట్ రాఘవ శర్మ పాల్గొన్నారు.

పూర్ణానందంపేటలో ఇంటింటికీ జనసేన

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్ర అభివద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేనాని పవన్ కళ్యాణ్ నిరంతరం పోరాటం చేస్తున్నారని జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్ అన్నారు. బుధవారం ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వంకార్యక్రమం 17వ రోజు 35వ డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో పూర్ణానందంపేట తదితర ప్రాంతాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ రాజ్, మల్లెపు విజయలక్ష్మి, సుమన్ నాయక్, నవీన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన కుట్రపూరితం : బుద్ధా

ప్రజాశక్తి-వన్‌టౌన్: జగన్ కుట్రపూరిత పాలనపై మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్రప్రాంత టీడీపీ ఇన్ ఛార్జ్ బుద్దా వెంకన్న మండిపడ్డారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌కు పదవీకాంక్షే ముఖ్యమని, దానికోసం తల్లిని, చెల్లిని వాడుకొని వదిలేశాడని విమర్శించారు. సొంతబాబాయ్ కూతురిపై దారుణంగా విషప్రచారం చేయిస్తున్నాడని అన్నారు. సొంత తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని ఆడబిడ్డలకు అన్నను, చిన్నారులకు మేనమామను అనిచెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు సాదరబోయిన ఏడుకొండలు, కొట్టేటి హనుమంతరావు, కామా దేవరాజు, ఉమ్మడి చంటి, గణపా రాము తదితరులు పాల్గొన్నారు.

43వ డివిజన్లో వెలంపల్లి పర్యటన

ప్రజాశక్తి-భవానీపురం: విజయవాడ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. అలాగే వందల కోట్ల రుపాయల నిధులతో పశ్చిమ నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తున్నామన్నారు. స్థానిక 43వ డివిజన్ ఏకలవ్య నగర్ 140వ సచివాలయం పరిధిలో బుధవారం నాడు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఈ డివిజన్ లో జరుగుతున్న అభివద్ధిని పరిశీలిస్తూ త్వరిగితగతిన అభివద్ధి పనులు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సుమారు రూ.24 కోట్లతో డివిజన్‌ను అభివద్ధి పరుస్తున్నామన్నారు. నేటికి రూ.12 కోట్ల నిధులతో అభివద్ధి పరిచామని, మిగిలిన అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, వైసీపీ నాయకులు బట్టిపాటి శివ, కట్టాసత్తయ్య, కంది శ్రీనివాసరెడ్డి, మాదాల తిరుపతిరావు, పువ్వుల కాంతారావు, మద్దెల రామకష్ణ, కనకం వెంటేశ్వర్లు యాదవ్, మాగం ఆత్మారామ్, ఎస్వీ రెడ్డి, తిరుపతి రెడ్డి, వి. శ్రీనివాసరెడ్డి, ముద్దు లక్ష్మి, కె.రమాదేవి, సచివాలయం కన్వీనర్లు, గహసారధులు తదితరులు పాల్గొన్నారు.

దేశం బాగుండాలంటే మోడీ దిగిపోవాల్సిందే...

సిపిఎం, సిపిఐ ప్రచార భేరీలో నేతలు

ప్రజాశక్తి-తిరువూరు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్యులపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు లాభాలు చేకూరుస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. సిపిఎం, సిపిఐ ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా తిరువూరు బోసుబొమ్మ ఏటీఎం సెంటర్‌లో బుధవారం రాత్రి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ అధ్యక్షత బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ దేశాన్ని కాపాడుకోవాలంటే మోడీని గద్దె దించాల్సిందేనన్నారు. మోడీ రాకముందు రూ.425 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1200 వరకు వచ్చిందన్నారు. మోడీ మళ్లీ వస్తే ఇది రూ.2 వేలకు పోతుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోతున్నాయన్నారు. ఈ ఎనిమిదేళ్లలో పెట్రోల్, డీజిల్ మీదే రూ.26 లక్షల కోట్ల మేర పన్నులు వేశారని చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థలను మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుంటే వాటికి వ్యతిరేకంగా మాట్లాడకుండా టిడిపి, వైసిపి మద్దతు పలుకుతున్నారని చెప్పారు. మోడీపై పోరాడకుండా జగన్, చంద్రబాబు లొంగిపోతున్నారన్నారు. దేశ ప్రజల కోసం, అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు, నాయకులు తూము కష్ణయ్య, నాగుల్ మీరా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వన్‌టౌన్: సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పలపాటి రామచంద్ర రాజు భవన్ చిట్టినగర్ సొరంగం వద్ద ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో ప్రత్యక్ష పన్నులతో పాటు పరోక్ష పన్నులతో ప్రజలపై భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. ఆర్థిక అరాచకవాది నరేంద్ర మోడీకి జగన్ ప్రభుత్వం కొమ్ము కాస్తుందన్నారు. విశాఖ ఉక్కునే కాదు, మోడీ దేశాన్నే అమ్మేస్తున్నారన్నారు. మూడు రాజధానుల పేరుతో రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన పాపం మోడీ, జగన్‌లదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సిపిఎం నాయకులు కె.సూరిబాబు, సాంబశివరావు, చిన్నబాబు, ఎస్.సుబ్బారెడ్డి సిపిఐ నాయకులు లంకా దుర్గారావు, కె.వి.భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, డి.వి.రమణబాబు, కొట్టు రమణరావు, తూనం వీరయ్య, ఓర్సు భారతి, తమ్మిన దుర్గ, చింతాడ పార్వతి, దుర్గాసి రమణమ్మ, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎ.కొండూరు: ఎ.కొండూరు మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు అనంతరం ఉపాధీ కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పి ఆనందరావు ఎస్ రామకష్ణారెడ్డి, డి చిన్నలక్ష్మారెడ్డి, డి మురళీకష్ణ, ఎం.గోపి, టి.భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని మక్కపేట, గోపినేనిపాలెం గ్రామంలో గాంధీ బొమ్మ సెంటర్లో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో బస్‌స్టాండ్ సెంటర్ నుండి గ్రామపంచాయతీ కార్యాలయం, ఎలిమెంటరీ స్కూలు, లైబ్రరీ సెంటర్, మాజీ సర్పంచ్ బజారు, ఎస్సీ కాలనీ, మసీదు సెంటర్ అంబేద్కర్ సెంటర్, వీఆర్వో కార్యాలయం మీదుగా తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బి.రాము, కోసూరి కృష్ణ, కరిసే రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ సెంటర్‌లో ప్రచారభేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు వలం కొండ, బ్రహ్మం, కోట కళ్యాణ్, కనకపూడి బాబూరావు, వేల్పుల కాంతయ్య, గడ్డం శ్రీనివాసరావు, బసవయ్య, చంద్రకంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు వట్టికొండ పార్థసారథి, సిపిఐ నాయకులు ప్రకాష్‌రావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సిపిఐ జిల్లా నాయకులు చుండూరు సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాలను నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కోట కళ్యాణ్, మండల కార్యదర్శి చాట్ల రవి, కోడూరు పిచ్చేశ్వరరావు, రమేష్, సిపిఐ నాయకులు చంద్రబాబు, షేక్ మహబూబ్, సుభాని, సుంకర నరసింహారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

తిరువూరు సభలో మాట్లాడుతున్న బాబూరావు

వీరులపాడు సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెనుగంచిప్రోలులో...

మార్కెట్లోకి హయర్ క్యూఎల్ గూగుల్ టివి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అద్భుతమైన ఫీచర్లు, సరికొత్త వీక్షణ అనుభవాన్ని అందిస్తున్న హయర్ క్యూఎల్‌ఈడీ సెగ్మెంట్‌లో గూగుల్ టీవీని మార్కెట్లోకి విడుదల చేసినట్లు హయర్ అప్లయెన్సెస్ సంస్థ అధ్యక్షులు ఎన్.ఎస్. సతీష్ తెలిపారు. నగరంలోని హయర్ సంస్థ కార్యాలయంలో టీవీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హయర్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇండస్ట్రీలో అత్యుత్తమ పిక్చర్ క్వాలిటీతో క్యూఎల్‌ఈడీ టీవీ విభాగంలోకి ప్రవేశించినట్లు తెలిపారు. ఇది వినియోగదారులకు టీవిని చూడటంలో కొత్త అనుభవాన్ని అందిస్తుందని తెలియచేశారు. ఈటివి గూగుల్ సహాయంతో పనిచేస్తుందని ఇది హ్యాండ్ ఫ్రీ వాయిస్ కంట్రోల్, గూగుల్ ప్లే స్టోర్ కలిగిఉంటుందని తెలిపారు అందరికీ అందుబాటు ధరల్లో లభ్యమవుతుందని నగరంలోని హయర్ షోరూమ్‌తో పాటు అన్ని ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లలో లభ్యమవుతుందని తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సహకరించాలి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరంలో ప్రజల రెవెన్యూ శాఖపరమైన సమస్యలు వేగవంతంగా పరిష్కారం చేసేందుకు సహకారం అందించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులయిన పి సంపత్‌కుమార్‌ను మేయర్ భాగ్యలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

లూబ్రికెంట్స్ విభాగంలోకి బ్రేక్స్ ఇండియా

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఆటోమోటివ్ రంగంలో భద్రతకు, నాణ్యతకు అత్యంత విశ్వసనీయమైన సంస్థలలో ఒకటైన బ్రేక్స్ ఇండియా సంస్థ సరికొత్తగా రెనియాతో లూబ్రికెంట్స్ ఆయిల్ విభాగంలోకి ప్రవేశిచినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ ఎస్.సుజిత్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సరికొత్త రెవియా లూబ్రికెంట్ ఆయిల్‌తో అటు ప్యాసింజర్ కార్లతో పాటు కమర్షియల్ వెహికల్స్ విభాగంలో ఇంజన్ ఆయిల్‌తో రెండింటికీ వైవిధ్యభరితమైన అవసరాలను తీర్చనుందని తెలిపారు. నూతన ఇంజన్ ఆయిల్ ప్యాసింజర్ కార్లకు 5 రకాలు, వాణిజ్య వాహనాలకు నాలుగు రకాలతో మొత్తం 9గ్రేడ్ల ఇంజిన్ ఆయిల్‌గా లభ్యమవుతుందని తెలిపారు.

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

మండల కేంద్రంలో మేడే జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం.మహేష్ పిలుపునిచ్చారు. కొండపల్లి పారిశ్రామిక వాడలోని హెచ్‌పిసియల్ ట్రక్‌టెర్మినల్ డ్రైవర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తుందన్నారు. పని గంటలు పెంచి కార్పొరేట్లకు లబ్దిచేకూర్చే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పిసియల్ ట్రక్ డ్రైవర్స్ యూనియన్(సిఐటియు) ప్రెసిడెంట్ ఎస్ సుందరరావు, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బుల్లియ్య, శేషగిరిరావు, రమేష్, సుబ్బారావు, రాజు పాల్గొన్నారు.

2 నుంచి స్విమ్మింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని మూడు స్విమ్మింగ్ పూల్స్ (సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్, గాంధీనగర్, డా.కె.ఎల్.రావు స్విమ్మింగ్ పూల్, చిట్టినగర్, గురునానక్ కాలని స్విమ్మింగ్ పూల్)లో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు వచ్చే నెల 2 నుంచి నుండి 31 వరకు నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం ఆయా స్విమ్మింగ్ పూల్స్ ఇన్‌ఛార్జిలను సంప్రదించాలని కోరారు.

పాఠ్యాంశాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని కొనసాగించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సిబిఎస్‌ఇ సిలబస్ నుండి డార్విన్ సిద్ధాంతం తొలగించడం సరైనది కాదని, డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాలలో కొనసాగించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాలలో సిబిఎస్‌ఇ పదవ తరగతి సిలబస్‌లో డార్విన్ సిద్ధాంతం కొనసాగించాలని కోరుతూ నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం చరిత్రను మార్చే ఆలోచనను మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు, విజయవాడ నగర నాయకులు రాజ్‌కుమార్, భార్గవ్, శైని, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో మెండు

- గ్రామీణ పేదలకు ఉన్నతమైన సహాయాలు

సమాజంలో సేవాభావం కలిగిన ఎందరో పలు సేవా కార్యక్రమాలను చేపట్టం ద్వారా ఆపన్నులను ఏదో ఒక రూపంలో ఆదుకుంటున్నారు. 'సొంత లాభం కొంతమానుకుని పొరుగువాడికి సాయపడవోయ్' అన్న గురజాడ అప్పారావు స్ఫూర్తితో కొందరు సమాజ సేవలో తనదైన శైలిలో కృషిచేస్తున్నారు. వృద్ధులు, మహిళలు, అనాథలు, వితంతువులు, అభాగ్యులు ఇలా ఎందరికో అనేక రూపాల్లో ఆర్థికంగానూ, వస్తు రూపేణా ఇలా అనేక రూపాల్లో సహాయ సహకారాలను మెండు మురళి అందజేస్తున్నారు. సామాజిక సేవల్లో ఆయన ముందుకు దూసుకుపోతున్నారు.

స్ఫూర్తి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఓ మారుమూల చిన్న గ్రామీణ ప్రాంతంమైన మందవాని పాలెం గ్రామంలో పేద కుటుం బంలో మెండు మురళి జన్మించారు. పేద కుటుంబం కావటంతో చదువు కోవటానికి అనేక అష్ట కష్టాలు పడ్డారు. ఉన్నత విద్యను అభ్యసిం చారు. వృత్తి రీత్యా ఢిల్లీ హైకోర్టు న్యాయ వాదిగా మెండు మురళి పనిచేస్తూ స్థిరపడ్డారు. మాతృభూమిపై మమకారంతో భారతదేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని 2005లో 'మెండు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ'ని గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో స్థాపించారు. సహాయం అవసరమున్న ప్రతి విషయంలో తనదైన శైలిలో సహాయ కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఎందరికో స్ఫూర్తిదాయ కమయ్యారు. ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను ప్రభుత్వం గుర్తించింది. మెండు మురళి తన ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అనేక రూపాల్లో కొనసా గుతున్నాయి. సమాజంలో నేటికీ కొనసాగుతున్న నిరక్షరాస్యతను రూపు మార్చేందుకుగాను పలు అక్షరా స్యతా అవగాహనా కర్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అనేక చోట్ల మొక్కలు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలకు దుస్తులు పంపిణీ, ఆర్థిక సహాయం చేయటం వంటివి పలు దఫాలుగా నిర్వహిం చారు. ప్రజలకు చట్టాలపై అవగాహన లేకపోవటంతో వివిధ రూపాల్లో మోసాలకు గురౌతుండటంతో పేదలు, మహిళలకు ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ఉచితంగా న్యాయ సలహాలు సైతం ఇస్తున్నారు. చదువుకునే విద్యార్థులకు ఆర్థిక సహాయాలు చేయటం, కళాశాల, కోర్సుల ఎంపికలకు సంబంధించిన విద్యారంగ సమాచారాలను తెలియజేస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చేలాగా, కెరీర్ గైడెన్స్‌పై ఉద్యోగ సహాయక కార్య క్రమాలు చేపడుతున్నారు. వృత్తి విద్య, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి వివిధ అంశాలపై అవగాహనలు, వివిధ పంటల సాగు అంశాలు, ఆదాయం తెచ్చిపెట్టే ఉద్యానవన పంటలకు సాగు, విత్తనాల ఎంపిక పక్రియలు, శిక్షణా కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత, గ్రామీణ పారిశుధ్యం, రక్షిత మంచినీటి యాజ మాన్య పద్ధతులపైన అవగాహనా, శిక్షణా కార్యక్రమాలను సైతం చేపట్టారు. చెరువులు, నదులు, సముద్రాల్లో నీటి రక్షణా చర్యలు, కాలుష్యం, ప్రకృతి వనరుల రక్షణ, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆటలు ఆడటం ద్వారానే శారీరక, మానసిక వికాసం, ధృఢత్వం పెరుగుతుందనే ఆలోచనలతో విద్యార్థులు, యువతను క్రీడల పట్ల ప్రోత్సహిస్తున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, సాహిత్య అంశాలపై సమగ్ర అవగాహన కోసం పలు సదస్సులు, సమ్మేళనాలను సైతం నిర్వహించారు. పిల్లలు, యువతలో నిబిడీకృతమైన సృజనాత్మక శక్తులను వెలికితీయటం ద్వారా వారిని ఉన్నతులుగానూ,పరిపూర్ణులుగా తయారు కావటానికి గాను పలు ప్రోత్సాహక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్య క్రమాలు వంటివి నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగులకు క్షేత్రస్థాయిలో ఉచిత శిక్షణలను అందించి ఉపాధి కల్పించటానికి మెండు మురళి కృషిచేస్తున్నారు. సామాజిక సేవల్లో ముందుకు సాగుతున్న ఆయనను పలువురు అభినందిస్తున్నారు.

ఇంటర్లో సంతోష్ అత్యుత్తమ ప్రతిభ

గన్నవరం (హనుమాన్‌జంక్షన్) : బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన మానికల వెంకటేశ్వరరావు (టాపీమేస్త్రీ) కుమారిల కుమారుడు సంతోష్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 470 మార్కులకు 460 మార్కులు సాధించాడు. ఎంతో ప్రతిభతో మంచి మార్కులు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిన సంతోష్‌ను అతని తల్లిదండ్రులు, అధ్యాపకులు, గ్రామ సర్పంచ్ పిల్లా అనిత రామారావు, గూడవల్లి రత్నసుధాకర్ , లంకా సురేంద్ర మోహన బెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్, మాజీ సర్పంచ్ నందమూరి కృష్ణప్రసాద్, ఎంపిటిసిలు దూసరి నిర్మల, అమృతపల్లి సూర్యనారాయణ, కోడేబోయిన బాబి, అత్మూరి బాలాజీ వాణీ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ నందిగం రవికుమార్, ఇఒ శ్యామలరావు, వీఆర్వో శేఖర్, వివిధ శాఖల గ్రామ పరిపాలన అధికారులు, ప్రముఖులు, గ్రామస్తులు అభినందించారు.

ఆర్‌కె సేవలు అభినందనీయం : బోధకులు

గుడివాడ : గుడివాడకు చెందిన జనసేన నాయకుడు మాచర్ల రామకృష్ణ (ఆర్.కె) గుడివాడ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి డాక్టరేట్‌ను సాధించారనీ, వేసవిలో ప్రయాణీకులకు చల్లని నీరు, మజ్జిగ అందించేందుకు డొక్కా సీతమ్మ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్వమత బోధకులు ఫుల్ గాస్పెల్ చర్చ్ బిషప్ అపికట్ల జాషువా, దేవాలయం పూజారి కుమార్, ముస్లిం పెద్ద ఇమామ్‌లు అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జనసేన నాయకుడు ఆర్‌కె అధ్వర్యంలో డొక్క సీతమ చలివేంద్రాని సర్వమత భోదకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల మతాలతీతంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం, సమాజం, దేశం కోసం పనిచేయడమేన్నారు. ఆర్‌కె మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కార్యకర్తలుగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల సీతయ్య, జనసేన నాయకులు షేక్ మీరాషరీఫ్, నూనె అయ్యప్ప, గంటా అంజి, చరణ్, నాగసాయి, సాయి, ఆర్య, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మతబోధకులు

గ్రామాల్లో మేడే జెండా ఎగరాలి : సిఐటియు

గన్నవరం : మే డే రోజున గన్నవరం మండలంలోని ప్రతి గ్రామంలో కార్మికులు జెండా ఎగురవేయాలని సిఐటియు మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం గన్నవరంలోని సంఘ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడంలేదన్నారు. పోరాటాల ద్వారా వాటిని పరిష్కరించుకోవాలన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి పని చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులకు ఎంతో గుర్తింపు ఇచ్చే మేడే వేడుకలను ఘనంగా జరపాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బెజవాడ తాతబ్బాయి, పిల్లి మహేష్, బడుగు మరియదాసు, బ్రహ్మాచారి, నాగలక్ష్మి, సమ్మక్క, అంగన్వాడీ వర్కర్లు, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె.వెంకటేశ్వరరావు

పిన్నమనేని సరోజినీదేవి మృతి

ప్రజాశక్తి-గుడివాడ

కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు సతీమణి, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరావు తల్లి పిన్నమనేని సరోజినీదేవి (రాజమ్మ) (87) బుధవారం నందివాడ మండలంలోని రుద్రపాక గ్రామంలోని స్వగృహంలో మృతి చెందారు. భౌతికకాయాన్ని పలు రాజకీయ పార్టీ నాయకులు సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. సోషలిస్టు నాయకులు పిన్నమనేని భూపతిరాయుడు, మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), బిజెపి రాష్ట్రనాయకులు రామనేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, వామపక్ష నాయకులు గూడపాటి ప్రకాష్‌బాబు, ఆర్‌సిపి రెడ్డి, ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాము, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా కో కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు నియామకం

ప్రజాశక్తి-గన్నవరం

కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ కో- కన్వీనర్‌గా ముస్తాబాద్‌కు చెందిన చోడవరపు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య అధికారంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రిజర్వేషన్ల సమస్య పరిష్కారంలో ప్రభుత్వం సరైన విధానం అమలు చేయడం లేదని, కేంద్ర ప్రభుత్వం నిర్మించి మోసం చేస్తుందని విమర్శించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఈశ్వర్‌కు కాంస్య పతకం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

ప్రపంచ వ్యాప్తంగా అగ్రగామి సంస్థ సిస్కో నిర్వహించిన జాతీయస్థాయి నెట్ రైడర్స్ పోటీల్లో స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థికి కాంస్య పతకం దక్కిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి వి ఎస్ ఎన్ ఆర్ వి ప్రసాద్ బుధవారం తెలిపారు. 1997లో సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ ఏడు రాష్ట్రాలలో 64 విద్యాసంస్థలలో ప్రారంభించబడి, నేడు సుమారు 190 దేశాలకు విస్తరించిందని పేర్కొన్నారు. ఎంతోమంది విద్యార్థులకు నెట్వర్క్ రంగంలో తగిన తర్ఫీదునిచ్చి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అవసరమైన ఇంటర్నెట్ సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తున్నట్లు వివరించారు. సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ పోగ్రాం ఒక సమగ్ర లెర్నింగ్ ప్రోగ్రామ్‌గా పేర్కొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కళాశాలలో కూడా నెట్వర్కింగ్ అకాడమీ సెంటర్‌ను స్థాపించి విద్యార్థులకు తగు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా 2023కు నెట్ వర్కింగ్‌కు సంబంధించి సిస్కో నిర్వహించిన జాతీయస్థాయి నెట్ రైడర్స్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తృతీయ సంవత్సరం విద్యార్థి పురమ ఈశ్వర్ కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ సెంటర్‌లో శిక్షణ పొందడం ద్వారా సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేటి తరం రేపటి అవకాశాలను పొందడంలో కంపెనీలకు సహాయపడుతుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. సిస్కో నియమాలను అనుసరించి శిక్షణ పొందిన ప్రతి 100 మంది విద్యార్థుల్లో అభిరుచి కలిగి విశేష ప్రతిభ చూపిన ఒక విద్యార్థిని ఎంపిక చేసి ఈ పోటీలకు పంపామని తెలిపారు. గత సంవత్సరం శిక్షణ పొందిన 300 మంది విద్యార్థులకు గాను ప్రతిభావంతులైన ముగ్గురిని నెట్ రైడర్స్ పోటీలకు పంపడం ద్వారా ఒకరికి కాంస్య పతకం వచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. కళాశాల సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ సెంటర్ కోఆర్డినేటర్, ఇనస్ట్రక్టర్‌గాగా కె.ఋషేంద్రబాబు, ఇనస్ట్రక్టర్స్ బాలాజీ, ఎం.ఎన్. సతీష్‌లు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో నెట్ రైడర్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన విద్యార్థి పురము ఈశ్వర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్ అభినందించారు. సిస్కో, నెట్వర్కింగ్ అకాడమీ ద్వారా పొందిన ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి. హెచ్. శాస్త్రి, డైరెక్టర్ (ఎఅండ్ఎస్ఎ), డాక్టర్ బి.కరుణకుమార్, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్రబాబు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగాధిపతి డాక్టర్ వై.శ్యామల, ఇనస్ట్రక్టర్స్ ఋషేంద్రబాబు, కె.బాలాజీ, టి.సతీష్ ఎం.ఎన్. పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు విజేత పురమ ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

తిరువూరులో కిడ్నీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి : ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పరిసర ప్రాంతాలలో కిడ్నీ జబ్బులు పెరిగిపోయినందున వెంటనే ఆ ప్రాంతంలో కిడ్నీ హాస్పటల్‌ను ప్రారంభించాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కె సాయి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం డాక్టర్ సాయి ప్రసాద్‌తోపాటు పాటు వేదిక జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మామిడి సీతారామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్, కోశాధికారి లీలా, స్థానిక కార్యకర్త శ్రీనివాస్ తదితరులతో కూడిన బందం తిరువూరు డయాలసిస్ సెంటర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించింది. ఆసుపత్రిలో ఉన్న రోగులను, రోగుల బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తిరువూరు, ఏ కొండూరు ప్రాంతాల్లో పెరుగుతున్న కిడ్నీ జబ్బులపై ప్రజారోగ్య వేదిక పని చేస్తోందన్నారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న కిడ్నీ జబ్బులను దష్టిలో ఉంచుకుని తిరువూరులో డయాలిసిస్ సెంటర్‌ను ప్రభుత్వం ప్రారంభించగా సుమారు 70 మంది రోగులకు సేవలందిస్తోందని, కానీ పెరుగుతున్న కేసులలో వ్యాధి ముదిరిపోయి డయాలిసిస్ వరకు రాక మునుపే వ్యాధిని అరికట్టేందుకు కషి చేయాలని పేర్కొన్నారు. వ్యాధి తీవ్రత పెరగక ముందే వైద్యం ఇవ్వగలిగితే అత్యధిక ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో తిరువూరులో యుద్ధ ప్రాతిపదికన కిడ్నీ ఆసుపత్రికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పూర్తి స్థాయిలో నెఫ్రాలజిస్టులను నియమించాలని కోరారు. ఈ సందర్భంగా తిరువూరు డయాలిసిస్ సెంటర్ మరియు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సౌకర్యాలను పరిశీలించారు. అక్కడ సేవలు అందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి ప్రజా ఆరోగ్య వేదిక తరపున అభినందనలు తెలిపారు.

30న కార్మిక సాంస్కృతిక ఉత్సవాలు

జాషువా సాంస్కృతిక వేదిక

ప్రజాశక్తి - విజయవాడ : మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 30న కార్మిక సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, బి.నరేన్, ఎం.జగదీష్, ఎం.బి.వి.కె బాధ్యులు టి. క్రాంతి తదితరులు తెలిపారు. ఎంబివికెలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ మొఘలరాజపురం సిద్ధార్థా ఆడిటోరియంలో జాషువా సాంసతిక వేదిక నిర్వహణలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటలవరకు నిర్విరామ కళారూపాల ప్రదర్శన ఉంటుందన్నారు. బ్యాంకు ఆఫీసర్స్ నుండి బిల్డింగ్ కార్మికుల వరకు అన్ని రకాల ఉద్యోగ, కార్మికులు వారి కుటుంబ సభ్యులు సంఘటితంగా కళారూపాలు ప్రదర్శిస్తారని తెలిపార. ఈ కారక్రమాన్ని ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు ప్రారంభిస్తారని తెలిపారు.

శివమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.బాబూరావు, వి.కృష్ణయ్య, కె.ఎస్.లక్ష్మణరావు

ఐద్వా నాయకులు శివమ్మ కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఐద్వా నాయకులు, సిపిఎం మంగళగిరి మండల సీనియర్ నాయకులు మొసలి పకీరయ్య సతీమణి, పార్టీ మంగళగిరి మండల కార్యదర్శి మొసలి జ్యోతిబాసు తల్లి ముసలి శివమ్మ (72) బుధవారం కన్నుమూశారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శివమ్మ భౌతికకాయంపై నాయకులు సిపిఎం, ఐద్వా పతాకాలను కప్పి నివాళులర్పించారు. శివమ్మకు నలుగురు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు జ్యోతిబసు సిపిఎం మండల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, మిగిలిన కుమారులు సిపిఎం అభిమానులుగా ఉన్నారు. ఐద్వా నాయకురాలిగా పనిచేసిన శివమ్మ సిపిఎం తరపున ఎంపిటిసిగా ఎన్నికల్లో పోటీ చేశారు. శివమ్మ అంత్యక్రియలు ఆత్మకూరులో జరిగాయి.

పలువురు ప్రముఖుల నివాళి

శివమ్మ భౌతికయాన్ని మాజీ ఎంపి, సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు జెవి రాఘవులు, జొన్నా శివశంకర్, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, డి వెంకటరెడ్డి, బి వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లాకార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తదితరులు నివాళు లర్పించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం

ముసలి శివమ్మ మతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆమె మతికి చింతిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. శివమ్మకు విప్లవ జోహార్లర్పించారు.

మొదటి పేజీ తరువాయి

మనదే అగ్రస్థానం

ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు.

పెరిగిన ఉత్తీర్ణత

గత ఏడాదితో పోలిస్తే ఉమ్మడి కృష్ణాజిల్లా ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత పెరిగింది. గత ఏడాది ద్వితీయ సంవత్సరంలో 72 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈఏడాది 83 శాతం సాధించింది. అంటే గత ఏడాదితో పోలిస్తే 11 శాతం ఉత్తీర్ణత పెరిగింది. అలాగే మొదటి సంవత్సరంలో గత ఏడాది 69 శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, ఈఏడాది 77 శాతం సాధించింది. అంటే 8 శాతం ఉత్తీర్ణత పెరిగింది. గత ఏడాది కూడా ఉమ్మడి కృష్ణాజిల్లా ఇంటర్ ఫలితాల్లో నెంబర్ వన్‌గా నిలిచింది.

తొమ్మిదేళ్లుగా కృష్ణా టాప్

గత తొమ్మిదేళ్లుగా ఉత్తీర్ణతా శాతం పరిశీలిస్తే వరుసగా ఇంటర్ ఫలితాల్లో కృష్ణాజిల్లానే అగ్రస్థానంలో నిలుస్తోంది. ఉత్తీర్ణతా శాతం జిల్లాల్లో తగ్గుదల పెరుగుదల ఉన్నా కృష్ణాజిల్లా మాత్రం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంటోంది. 2021లో కరోన కారణంగా పరీక్షలు నిర్వహించకపోవడంతో అందరూ ఉత్తీర్ణత సాధించినట్లుగా పరిగణించారు. మిగతా అన్ని సార్లు 2015 నుండి జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తోంది.

హర్షం వ్యక్తం చేసిన కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో ఉమ్మడి కష్ణాజిల్లా ప్రథమ స్థానంలో నిలిచినందులకు కష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కషి చేసిన అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యం

విద్యార్థులు పాల్గొన్నారు. మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు జగనన్న వసతి దీవెన పథకం కింద 33,442 మంది విద్యార్థులకు చెందిన 29,545 మంది తల్లుల ఖాతాల్లో రూ.31.65 కోట్లు జమ చేస్తూ నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద లబ్ది అందుకున్న తల్లులు తమ పిల్లల కోసం వినియోగించాలని, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదివి వద్ధిలోనికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమశాఖ డిడి సరస్వతి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎ.శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణి దూర్జటి, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ముడా మాస్టర్‌ప్లాన్‌పై అపోహలు తగదు

దేవాలయం, కంతేటి వారి నిర్వహణలో కొనసాగిస్తున్న భావనారాయణ స్వామి దేవాలయం, గీతా మందిరం, చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయం తదితర దేవాలయాలు, మసీదులు సైతం పబ్లిక్ - సెమీ పబ్లిక్ పరిధిలో చూపుతూ ఎరుపు రంగుతో మార్క్ చేయబడ్డాయన్నారు. అజ్ఞానంతో కొందరు తానేదో ఆశించి కొందరి ఆస్తులను, చర్చిలను ముడా మాస్టర్ ప్లాన్‌లోని పబ్లిక్ - సెమీ పబ్లిక్ పరిధిలోకి తెచ్చినట్లు వ్యాఖ్యానిస్తున్నారని విమర్శించారు. ఈమాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే ముడా, హెస్కాని డిహెచ్‌సి కన్సాలిటెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో 2018 మార్చి 20వ తేదీన పరస్పర ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు భవిష్యత్తులో విస్తత ప్రయోజనాల నిమిత్తం ప్రజల కోసం నిర్దేశించిన ఆస్తులను పబ్లిక్, సెమీ పబ్లిక్ రెడ్ మార్కుతో మాస్టర్ ప్లాన్ మ్యాప్ తయారుచేయాలని నాటి ఒప్పందంలో ఉందన్నారు. 1997, 2011 సంవత్సరాల్లో కూడా మాస్టర్ ప్లాన్ ఇదేవిధంగా ఉందన్నారు. ఈ విషయాన్ని పాత మున్సిపల్ చట్టం సైతం చెబుతోందన్నారు. మాస్టర్ ప్లాన్‌లో ప్రజలకు మేలు చేసేవిధంగా 90 శాతం భూములు హౌసింగ్ జోన్లో ఉన్నాయని తెలిపారు. తమది పీపుల్స్, ఫార్మర్స్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మాస్టర్ ప్లాన్ రూపొందించామని చెప్పారు. ఈ సమావేశంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ముడా విసి రాజ్యలక్ష్మి, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ తదితరులు పాల్గొన్నారు.

లోపభూయిష్టం : కొల్లు రవీంద్ర

అర్బన్ డెవల్పోమెంట్ అథారిటీ (ముడా)ను ఏర్పాటు చేశామన్నారు. కానీ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని నిర్వీర్యం చేశారన్నారు. తాజాగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ లోపభూయిష్టంగా ఉందని విమర్శించారు. ప్రైవేట్ ఆస్తులను దోచుకునేలా దానిని తయారు చేశారన్నారు. గుడి, బడిని కూడా దోచుకునేలా ఉందని ఆరోపించారు. వైసిపి నేతల ఆస్తులను కమర్షియల్ జోన్‌లో పెట్టారని తెలిపారు. తాగునీటి అవసరాలను ఏ విధంగా తీరుస్తారో మాస్టర్ ప్లాన్‌లో చెప్పలేదన్నారు. మాస్టర్ ప్లాన్‌పై ప్రజలంతా అభ్యంతరాలు తెలియజేసి ముడా మాస్టర్ ప్లాన్‌ను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో ప్రజల పక్షాన నిలబడి పోరాడేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ రావు మాట్లాడుతూ స్వార్ధ ప్రయోజనాలకోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ప్లాన్లో పోర్ట్‌కు దగ్గరగా పరిశ్రమలకు అవకాశం లేకుండా ఎక్కడో మూలన పెట్టారన్నారు.

అనుమానాలు నివృత్తి చేయాలి : వైఎన్

కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌లో విద్యాసంస్థలను సెమీ పబ్లిక్, పబ్లిక్ జోన్‌లో ఉంచడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ కాపీలు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో లేవన్నారు. తక్షణమే వాటిని సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించి మాస్టర్ ప్లాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆ తర్వాత తగిన గడువు ఇచ్చి అభ్యంతరాల స్వీకరణ పూర్తయిన తర్వాత ప్రజామోదంతో తుది మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయాలన్నారు. మీడియా సమావేశంలో సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన
విజయవాడ రెండవ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టు
ఐ.ఏ. నెం. 1145/2019 ఇన్
ఓ.యస్.నెం.124/2017

మధ్య
మురహరిశెట్టి మురలిమోహన్ ..పిటీషనర్ / వాది
మరియు
నల్లమోలు నవరత్నం, భర్త : రాజశేఖర్, హిందువు, వయస్సు 50 సం॥లు, గృహిణి, నివాసం : వల్లూరువారి వీధి, కృష్ణలంక, విజయవాడ.
... రెస్పాండెంట్/ ప్రతివాది

సదరు పై తెలిపిన కోర్టువారు జారీచేసిన ఉత్తర్వులప్రకారం ఈ క్రింది తెలిపిన విషయములలో, ఇందులోని ప్రతివాదికి ఈ నోటీసును ప్రకటించడమైనది. పై తెలిపిన ఒరిజినల్ దావాలో పిటీషనర్ ఫైనల్ డిక్రీ పొందుటకు గాను దాఖలు చేయబడిన ఇన్‌టేరిమ్ అప్లికేషన్ నెంబర్ 1145/2019 విచారణ నిమిత్తం ది.15-6-2023 తేదీ నాటికి కోర్టువారు వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10-30 గం.లకు పై తెలిపిన కోర్టునందు స్వయంగా మీరుగానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరై సదరు పై తెలిపిన కోర్టు వారికి ఈ దావాలో రెస్పాండెంట్ అయిన మీరు మీ వాదనలను వినిపించు కొనవలెను. అట్లు కాని యెడల మీ పరోక్షమున సదరు కోర్టువారు దైనందిన తీర్పులను ఇవ్వగలరని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

కె.తాడేపల్లి
విజయవాడ రూరల్ మండలం,
యన్.టి.ఆర్.జిల్లా.
తేది : 27-4-2023
ఇట్లు
కొమ్మినేని భావనారాయణ,
పిటీషనర్ తరపు న్యాయవాది.
సెల్ : **9441014403**

పత్రికా ప్రకటన
విజయవాడ 2వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టు
ఐ.ఎ. నెం. 544/2022 నందు
ఐ.ఎ. నెం. 1144/2019 నందు
ఓ.యస్.నెం. 123/2017

మధ్య
మురహరిశెట్టి మురలిమోహన్ ..పిటీషనర్ / వాది
మరియు
1.నల్లమోలు రాజశేఖర్ (మరణించినారు) వారి వారసులు
2. నల్లమోలు నవరత్నం, భర్త : లేటు నల్లమోలు రాజశేఖర్, హిందువు, వయస్సు 50 సం॥లు, నివాసం : డి.నెం. 41-20/8-1, వల్లూరువారి వీధి, కృష్ణలంక, విజయవాడ.
3. నల్లమోలు రోజాదుర్గ, తండ్రి : లేటు నల్లమోలు రాజశేఖర్, హిందువు, వయస్సు 28 సం॥లు, డి.నెం. 41-20/8-1, వల్లూరువారి వీధి, కృష్ణలంక, విజయవాడ.
4. నల్లమోలు భవాని, తండ్రి లేటు నల్లమోలు రాజశేఖర్, హిందువు, వయస్సు 24 సం॥లు, డి.నెం. 41-20/8-1, వల్లూరువారి వీధి, కృష్ణలంక, విజయవాడ... రెస్పాండెంట్లు/ ప్రతిపాదిత ప్రతివాదులు

ఈ పబ్లిక్ నోటీసులోని అంశములు ఏమనగా ది. 18-4-2023 సదరు పై తెలిపిన కోర్టువారు ఇందులోని 2 నుండి 4 అను రెస్పాండెంట్లు/ ప్రతిపాదిత ప్రతివాదులైన మీకు అనగా ఇందులోని మరణించిన నల్లమోలు రాజశేఖర్ గారి వారసులైన మీపై ఇందులోని పిటీషనర్ పై తెలిపిన ఫైనల్ డిక్రీ పిటీషన్ నెంబర్ 1144/2019లో వారసులుగా చేర్చుటకుగాను దాఖలు చేసిన పిటిషన్ నెం. 544/2022లో తమ వాదనలు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ కోర్టునకు వినిపించుటకు గాను ది. 15-6-2023 తేదీ ఉదయం 10-30 గం.లకు హాజరు కావలసి వున్నదని పత్రికాముఖంగా తెలియ పరచవలసినదిగా కోర్టు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. గాన తమరు సదరు తేదీన పై తెలిపిన సమయమునకు కోర్టునకు హాజరుతో పాటు తమ వాదనలు వినిపించు కొనవలసినదిగాను, అట్లు కాని యెడల పై తెలిపిన వ్యాజ్యము మీ పరోక్షమున తుది తీర్పునకు కోర్టువారు ఇవ్వగలరని యిందుమూలముగా తమరికి పత్రికా పూర్వకంగా తెలియపరచడమైనది.

కె.తాడేపల్లి
విజయవాడ రూరల్ మండలం,
యన్.టి.ఆర్.జిల్లా.
సెల్ : **9441014403**
తేది : 27-4-2023
ఇట్లు
కొమ్మినేని భావనారాయణ,
పిటీషనర్ తరపు న్యాయవాది.

ఉపాధ్యాయులను వేధించడం ఆపేయాలి : ఫ్యాప్టో

మచిలీపట్నంలో

అవనిగడ్డలో

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

ఉపాధ్యాయులను తనిఖీల పేరుతో వేధిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు వ్యతిరేకంగా బుధవారం పది మూల్యాంకన కేంద్రమైన స్థానిక లేడీ ఆంప్తిల్ కళాశాల వద్ద కృష్ణాజిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.లంకేష్ మాట్లాడుతూ పాఠశాల సందర్శన పేరుతో పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను, అధికారులను సస్పెండ్ చేయడం, వేధించడాన్ని ఆపాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సెక్రటరీ జనరల్ డి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీరు విద్యా వ్యవస్థని గాడిలో పెట్టే విధంగా లేదని, నిర్వీర్యం చేసే విధంగా ఉందని విమర్శించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు మాట్లాడుతూ అధికారులు చేసే తప్పులకు కూడా ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదే పద్ధతిలో వెళ్తే ప్రభుత్వ విద్య వ్యవస్థ గాడి తప్పుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ఏ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు బూట్లు, యూనిఫాం ధరించలేదని, వర్క్ బుక్స్ పూర్తి చేయలేదని అనేక కారణాలు చూపిస్తూ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎస్ సి,ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎం.బాబూ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అధికారుల పాఠశాలల సందర్శన విద్య అభివృద్ధికి ఉపయోగపడాలేకానీ అందుకు విరుద్ధంగా ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలు గందరగోళానికి దారి తీస్తున్నాయని విమర్శించారు. ఎ పి టి ఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రోజు రోజు కి యాప్ ల భారం పెరుగుతూ విద్యను బోధించే సమయం తగ్గి పోతుందన్నారు. ఈ విధానంతో పాటు ప్రవీణ్ ప్రకాష్ పర్యవేక్షణ విధానం కూడా మారాలన్నారు. ఎ పి 257 జిల్లా కార్యదర్శి ఎ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ ఐక్య ఉద్యమాల వల్ల విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావొచ్చునన్నారు. ఎస్ టి యు నాయకులు సురేష్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సంబంధం లేని కారణాలకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వేణు, రామబ్రహ్మం, కొణతం మాధవరావు, మూర్తి, ఝాన్సీ, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గుడివాడ :** అక్రమంగా ఉపాధ్యాయుల సస్పెన్షన్ను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు నీలం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘం పిలుపుమేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు టి సీతారామయ్య, ఏవి వరలక్ష్మి, నరేంద్ర, ఎస్టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎంవిఎస్ఎన్ ప్రసాద్, జిల్లా సహాధ్యక్షులు పివిఎన్డి ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి దస్తగిరి, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్ కొంపటి రాజేంద్రప్రసాద్, యు టి ఎఫ్ నాయకులు సతీష్, అమ్మన్నబాబు, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కృష్ణా జిల్లా ఫ్యాక్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి.కనకారావు ఆధ్వర్యంలో అవనిగడ్డ తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలను సందర్శించేటప్పుడు ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తూ తల్లిదండ్రుల ముందర అవమానపరుస్తూ మానసిక ఆందోళనలకు ఉపాధ్యాయులను గురి చేయటం సరికాదన్నారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలనీ, భోధనేతర పనులను కేటాయించరాదని కోరారు. అనంతరం తహశీల్దార్ ఎల్ వి ఎస్ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ నాగప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి జి గోపాలకృష్ణ, యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు అవనిగడ్డ జీవేంద్రరావు, నలుపుర్తి శ్రీకాంత్, మోపిదేవి మండల అధ్యక్ష కార్యదర్శులు ఏ సూర్య కుమార్, జి శ్రీధర్, కోడూరు మండల అధ్యక్ష కార్యదర్శులు జి.విష్ణు నాగాయలంక బి.సాంబశివరావు, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు

గుడివాడలో

విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా ఏడిగా రామ్ కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

విభిన్న ప్రతిభావంతులు, టిజి, వయో వృద్ధుల సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా సహాయ సంచాలకులుగా బి.రామ్ కుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే శాఖలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న రామ్ కుమార్ ఇప్పటివరకు సహాయ సంచాలకులుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ శాఖలో విధులు నిర్వహిస్తున్న పలువురికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులుగా వ్యవహరించిన రామ్‌కుమార్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఆయన బుధవారం జిల్లా కలక్టర్ పి.రాజా బాబుని మర్యాద పూర్వకంగా కలసి బాధ్యతలు చేపట్టారు.ఎన్‌టిఆర్ జిల్లాకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించనున్నారు.

అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉన్నాం

పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నిరంతరం అభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తోందని పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంజాల సీతారామయ్య చెప్పారు. రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా నవరత్న పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తద్వారా అన్ని తరగతుల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ అభివృద్ధే ధ్యేయంగా కష్టపడి పనిచేస్తున్నారన్నారు. పామర్రు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారన్నారు. కష్ణాపురం గ్రామంలో తన ఎంపీటీసీ నిధుల రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. దేశన్నపాలెంలో రోడ్డు నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. ముసలి నాయకపాలెంలో అంగన్వాడీ కేంద్రం, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కృష్ణాపురంలో నాడు-నేడులో భాగంగా 20 లక్షలతో పాఠశాల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న లబ్ధి, మేలు గురించి విస్తృతంగా తెలియజేయటానికి కృషిచేస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపిని గెలిపించటం ద్వారా తిరిగి అధికారంలోకి వచ్చేలా ప్రజలు కృషిచేయాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పట్టాభి భవన నిర్మాణాన్ని ప్రారంభించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

స్వాతంత్ర్య సమరయోధులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ పి.రాజబాబును మర్యాదపూర్వకంగా కలిసి, వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్యలి జ్ఞాపకార్థం నిర్మించబోయే కన్వెన్షన్ హాల్, మ్యూజియం, లైబ్రరీ నిర్మాణానికి జిల్లా కోర్టు సెంటర్‌లోని రెవెన్యూ కళ్యాణ మండపం ప్రక్కన సర్వే వార్డు నెంబర్ -4లో రెండు ఎకరాల స్థలాన్ని గతంలో కృష్ణాజిల్లా కలెక్టర్ కేటాయించారని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకట బాబా ప్రసాద్, మచిలీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, మచిలీపట్నం నగర కార్పొరేషన్ జనసేన పార్టీ అధ్యక్షుడు గడ్డం రాజు, బిజెపి జిల్లా నాయకుడు పంతం గజేంద్ర, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొడమంచిలి చంద్రశేఖర్, పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు ఏ ఆర్ కె మూర్తి, వేమూరి రామకృష్ణారావు, పి.వి ఫణి కుమార్, మోపర్తి సుబ్రమణ్యం, తోట రాజేష్, నరహరశెట్టి రామ్ జ్యోతి, తదితరులు జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : సింహాద్రి

మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ

ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కఠోరమైన శ్రమ, ప్రణాళికాబద్ధమైన కృషి కూడా అవసరమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సూచించారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సమాజంలోని అసమానతల నుండి బయట పడాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఆర్థిక, సామాజిక అసమానతలను ఎదుర్కోవాలంటే విద్యార్థి దశ నుండే అది సాధ్యమవుతుందన్నారు. తాము చదువుకునే కాలంలో సమాజంలోని అసమానతలను రూపుమాపే ఆలోచనలతో జీవించామన్నారు. విప్లవ కవులను వార్షికోత్సవాలకు తీసుకొచ్చి విద్యార్థులకు మంచి సందేశాన్ని అందించేవారమన్నారు. నేడు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 20 ఏళ్ల క్రితం ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి ఉంటే రాష్ట్రం విద్యారంగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిలబడేదన్నారు. ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యులు కనకమెడల రవీంద్ర కుమార్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు తాను ఒకేసారి ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో పతకాలు సాధించిన విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం సమన్వయకర్త కడపకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏపీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు, ఎస్ వి ఎల్ క్రాంతి కళాశాలల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, కంచికచర్ల, మొవ్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సూరగం జగన్మోహనరావు, నీరజ, గాయకుడు బాలాసింగ్, ఎస్ఐ జి.రమేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుల ప్రేమపూర్వక కానుక

మచిలీపట్నం అర్బన్ : ప్రముఖ గాయని డాక్టర్ చిత్రపు కిరణ్మయి జ్ఞాపకార్థం బాల్యమిత్రులు ప్రేమపూర్వక కానుక అందించారు. స్థానిక త్యాగరాజ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో సంగీత జగద్గురు శ్రీ త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం మచిలీపట్టణానికి చెందిన ప్రముఖ గాయని కిరణ్మయి జ్ఞాపకార్థం ఆమె బాల్యమిత్రుల సౌజన్యంతో వారణాసి సునయన శాస్త్రీయ సంగీత సభ నిర్వహించారు. పలువురు శ్రోతలను గాయని సునయన తనదైన గాన మాధుర్యంతో మంత్రముగ్ధుల్ని చేశారు.

బిజెపిని గద్దె దించాలి

బంటుమిల్లి : దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న కేంద్రంలోని బిజెపిని గద్దె దించేందుకు అందరూ కృషిచేయాలని సిపిఎం జిల్లా నాయకుడు పంచకర్ల రంగారావు కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ బంటుమిల్లి మండలం జానకిరాంపురం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో రక్షణ బేరి బహిరంగ సభ జానకిరామపురం శాఖ కార్యదర్శి మాజేటి పద్మ అధ్యక్షతన జరిగింది. బంటుమిల్లి మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడారు. సిపిఎం బంటుమిల్లి మండల కమిటీ సభ్యులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్ ఘోష్, నాగిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జానకిరామపురంలో మాట్లాడుతున్న పంచకర్ల రంగారావు

ప్రభుత్వ భూమిని పార్టీ కార్యాలయానికి ఎలా కేటాయిస్తారు?

కార్మిక శాఖ స్థలంలో డిగ్రీ కళాశాల నిర్మించాలని సిపిఎం, సిపిఐ ధర్నా

ప్రజాశక్తి-భవానీపురం

ప్రభుత్వ భూమిని రాజకీయ పార్టీ కార్యాలయాలకు ఎలా కేటాయిస్తారని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రశ్నించారు. విద్యాధరపురంలో కార్మిక శాఖకు చెందిన సుమారు 5,300 గజాల స్థలాన్ని వైసిపి కార్యాలయ నిర్మాణానికి కేటాయిస్తూ సంవత్సరానికి రూ.వెయ్యి చొప్పున 33 సంవత్సరాలు లీజుకిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సితార సెంటర్ సెంటర్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా డి.వి.కృష్ణ, కోటేశ్వరరావు మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వైసిపి కార్యాలయానికి కేటాయించాలని ప్రతిపాదించటం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధులే రాజకీయ ప్రయోజనాల కోసం అధికారికంగా కబ్జా చేయడం తగదన్నారు. పాదచారులు నడవడానికి వీల్లేదని రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు పెట్టి అనుమతించని ఆర్టీసి అధికారులు ఇప్పుడు రాజకీయ పార్టీ కార్యాలయ నిర్మాణానికి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ భూమిలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజి, కమ్యూనిటీ హాలు, హస్పటల్ వంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, గురువారం జరగనున్న విఎంసి కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల తరుపున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై కౌన్సిల్ సమావేశంలో అధికార పక్షాన్ని నిలదీస్తామని సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, సిపిఎం నాయకులు గాదె ఆదిలక్ష్మి, ఎస్.సుబ్బారెడ్డి, కె.సూరిబాబు, అప్పలరాజు, పుల్లారావు, కాంతారావు, సిపిఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, కార్యదర్శి వర్గసభ్యులు పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు డి.వి.రమణబాబు, కొట్టు రమణారావు, సిపిఐ నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, ఉప్పలపాటి శివప్రసాద్ రాజు, మహిళ నాయకులు దుర్గాసి రమణమ్మ, చింతాడ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సితార సెంటర్‌లో ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

చెస్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ: జూనియర్ చెస్ అకాడమీ, విజయవాడ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 18 నుండి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్స్ ఫిడే రేటింగ్ చదరంగం పోటీలను జయప్రదం చేయాలనీ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. ఫిడే రేటింగ్ చదరంగ పోటీలకు సంబంధించిన పోస్టరును బుధవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కలెక్టరేటులోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. గురునానక్ కాలనీని గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ సైన్సెస్ నందు నిర్వహించే పోటీలలో జిల్లాకు చెందిన చదరంగం క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరచటం ద్వారా జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ కె.శ్రీనివాసరావు, జూనియర్ చెస్ అకాడమీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.డి అక్బర్ పాషా, మందుల రాజీవ్, మేనేజర్ గోపిక నాగసాహితి తదితరులు పాల్గొన్నారు.

29 నుండి ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 29 నుండి మే 7 వరకు 'ఫ్లేవర్స్ ఆఫ్ ఇండియా' థీమ్ తో మొట్టమొదటి సారిగా భవానీపురం పున్నమి ఘాట్‌లోని నది తీరాన ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవాడ నగరపాలక సంస్థ నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను బుధవారం ఆమె తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పంజాబీ, రాజస్థానీ, ఢిల్లీ, కేరళ, తందూరిలు ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల రుచికరమైన వంటకాలను తీసుకురాబోతున్నారన్నారు. సుమారు 20 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుండి రాత్రి 11 గంటల వరకు ఫెస్టివల్ ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'ఆ అసోసియేషన్ గుర్తింపును రద్దు చేయండి'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఇతర సంఘాలపై పెత్తనం కోసం సాటి ఉద్యోగులపై నిరాధార ఫిర్యాదులతో ఉద్యోగులను, ఇతర సంఘ నాయకులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్న ఏపీ కమర్షియల్ టాక్స్ సర్వీస్ అసోసియేషన్ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని ఎపి జీఎస్టీ ఆఫీసర్స్ అండ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సిహెచ్.పురుషోత్తంనాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెఆర్ సూర్యనారాయణ సాటి ఉద్యోగులను, ఇతర సంఘాలను వేధిస్తున్న తీరును వివరించారు. వాణిజ్య పన్నుల శాఖలో అక్రమ బదిలీలు జరిగాయని కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు వెళ్లిన అధికారి కృష్ణమోహన్‌రెడ్డిని ఆరు గంటలసేపు నిర్బంధించి తీవ్ర ఒత్తిడికి గురి చేశారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. ఆయన కుట్రలకు రాజేశ్వరి అనే ఒక దళిత మహిళా ఉద్యోగి సస్పెన్షన్‌కు గురైందని తెలిపారు. ప్రభుత్వం ఈమె సస్పెన్షన్ విషయంలో నిజా నిజాలు పరిశీలించి సస్పెన్షన్ ఎత్తివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వెంకటేష్, నిర్మల జ్యోతి, కోట శ్రీధర్, కె.సుధాకర్, ఏడుకొండలు, కళ్యాణ్‌కుమార్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర పెంపు : చలసాని

మాట్లాడుతున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు

ప్రజాశక్తి-వన్‌టౌన్ : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాల సేకరణ ధర పెంచుతూ బుధవారం జరిగిన కృష్ణామిల్క్ యూనియన్ 30వ సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. పాడిరైతులకు మరింత తోడ్పాటును అందించాలనే కత నిశ్చయంతో లీటరుకు పది శాతం వెన్న గల పాలకు కిలోకి రూ.20 రేటును పెంచి కిలో ప్యాకెట్ రూ.800గా నిర్ణయించామని చెప్పారు. ఆవుపాలు టోటల్ సాలిడ్స్‌కి రూ.10 రేటును పెంచి రూ.278గా నిర్ణయించి మే ఒకటి నుండి అమలు చేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల కృష్ణా మిల్క్ యూనియన్‌కు ఏడాదికి రూ.16 కోట్లు అదనపు భారం పడుతున్నప్పటికీ పాడి రైతుల శ్రేయస్సు దష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. పాడి రైతు, పశు సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం గడిచిన ఆర్థిక సంవత్సరములో రూ.15 కోట్లు వెచ్చించటం జరిగిందని తెలిపారు. దీని ఫలితంగా కృష్ణామిల్క్ యూనియన్ గడిచిన ఆర్థిక సంవత్సరంలో పాల సేకరణలో 19 శాతం వద్ధి సాధించటం జరిగిందని తెలిపారు. కృష్ణాజిల్లా వీరవల్లిలో సమితి నిర్మిస్తున్న నూతన డెయిరి సంబంధిత పనులను వేగవంతంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సహస్ర చండీయాగం

ప్రజాశక్తి-వన్‌టౌన్: లోక కళ్యాణార్థం శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి మే 3వ తేదీ వరకు సహస్ర చండీయాగం, కుంభా భిషేకం కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 72 అడుగుల ఎత్తైన అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తొలి రోజున రాష్ట్ర మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో సేవ్ టెంపుల్స్ భారత్ సంస్థ నిర్వాహకులు గజల్ శ్రీనివాస్, పీఠాధిపతి కరుమారి దాసు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షలపై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ, ఉపాధ్యాయుల, అధికారుల అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలోని టెన్త్ క్లాస్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద బుధవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణ విద్యారంగాన్ని బాగుచేయడం కోసమా, టీచర్లను శిక్షించడం కోసమా అని ప్రశ్నించారు. రాష్ట్ర సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయ వృత్తిని అవమానిస్తున్నారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి తన వైఖరి మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, ఫ్యాప్టో ఎన్‌టిఆర్ జిల్లా సెక్రటరీ జనరల్ ఇక్బాల్ బాషా, యన్‌టియు రాష్ట్ర నాయకులు తిమ్మన్న, బిటిఎ నాయకులు మోహన్‌రావు, బిఈఈడి అసోసియేషన్ నాయకులు చింతల సుబ్బారావు పలువురు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ముందు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం ఎంఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కన్వీనర్ మద్దినేని నాగేశ్వరరావు, యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ట్రెజరర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, చిన్నం నరసరావు, చాగల్లు రామారావు, బిట్ర వెంకటరమణ, మద్ది పుల్లారావు, కట్ట వంశీ, జిలానీ, మద్ది పుల్లారావు, నాగుల్‌మీరా, కామా ప్రభాకర్, మండాది వెంకటేశ్వరరావు, రాజకుమార్, ఎం.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపి అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు టి.వి.యల్.నరసింహారావు, అల్లిక నరసింహారావు, బియ్యాల రామారావు, పులి శ్రీనివాసరావు, శ్రీహరి, ప్రసాదరావు, సైదులు, జిలాని, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చిత్రాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** తిరువూరు తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల సుందరయ్య, నాయకులు అపర్ణ, మచ్చా శ్రీనివాసరావు, సూర్యనారాయణ, భవానీ, భారతకుమారి, ఎన్.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నందిగామలో...

తిరువూరులో...

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.